ఏ తీరున ఓటేశారో!

- పిఠాపురం నియోజకవర్గంలో యువత, మహిళలు, వృద్ధుల ఓటింగ్‌పై అంచనాలు
- స్వస్థలాలకు వచ్చిన ఓటర్ల ఓటుపై చర్చోపచర్చలు
- అంతా మాకే అనుకూలమంటూ అంచనాలు

- 8లో

జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి



- 19న జిల్లాస్థాయి పర్యావరణ పోటీలు
- జిల్లా కలెక్టర్ జె.నివాస్

జిల్లాస్థాయి పర్యావరణ పోటీలకు సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే16: జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణ కలెక్టర్ భావన, ఇతర అధికారులతో కలిసి గురువారం జిల్లాస్థాయి పర్యావరణ పోటీలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 19న జిల్లాస్థాయి పర్యావరణ పోటీలను పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. 4వ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు జీవవైవిధ్యంవల్ల లాభాలు అనే విషయంపై వ్యాసరచన, చిత్రలేఖనం, వృకత్వ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. పోటీలు ఈనెల 19వతేదీ ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు నిర్వహిస్తారన్నారు. వివరాలకు 6281158344 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ సమన్వయకర్త మహేశ్వరరావు, ఎంఎస్ఎన్ చారి టీస్ ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, క్లస్టర్ సమన్వయకర్తలు వీరభద్రరావు, రమణమూర్తి, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పర్యవేక్షణకు సీసీ కెమెరాలు



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జె.నివాస్

- డిస్‌ప్లే స్క్రీన్‌ల ద్వారా అభ్యర్థులు, ఏజెంట్లు పరిశీలించవచ్చు
- జిల్లా కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే 16: ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పరిశీలించేందుకు వీలుగా జేఎన్‌టీయూలో సీసీటీవీ కెమెరాల డిస్‌ప్లే స్క్రీన్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. సాధారణ ఎన్నికల 2024కు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూలో భద్రపరచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ జె.నివాస్, ఎన్నికల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల 2024కు సంబంధించి జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలకు చెందిన ఈవీఎంలను జేఎన్‌టీయూలోని వివిధ బ్లాకుల్లో సిద్ధం చేసి స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీలతో గుర్తింపు పొందిన ఏజెంట్లు స్ట్రాంగ్‌రూమ్‌లవద్ద భద్రతను పరిశీలించేందుకు వీలుగా జేఎన్‌టీయూ క్యాంటీన్ పైన సీసీ కెమెరాల డిస్‌ప్లే స్క్రీన్‌లను ఏర్పాటు చేశామన్నారు. పోటీలో నిలిచిన అభ్యర్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతరం విధులు నిర్వర్తించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. సిబ్బంది అంతా అప్రమత్తలతో వ్యవహరించి ప్రతిరోజూ ఉదయం స్ట్రాంగ్ రూమ్‌ల సీల్‌లను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల సందర్శనకు వచ్చిన ప్రతిఒక్కరి వివరాలను ఎప్పటికప్పుడు లాగ్ రిజిస్టర్‌లో నమోదు చేయడంతోపాటు వీడియో కెమెరాల్లో చిత్రించాలన్నారు. ఏదైనా సందేహం ఉంటే సంబంధిత రిటర్నింగ్, ఇతర అధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. జేఎన్‌టీయూ క్యాంటీన్ పైన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీలతో గుర్తింపు పొందిన ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరా స్క్రీన్, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఛాంబర్ మీటింగ్ హాలులో వివిధ నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లవద్ద నిర్వర్తించాల్సిన విధులపై దిశానిర్దేశం చేశారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన జేసీ

కలెక్టరేట్(కాకినాడ), మే 16: సాధారణ ఎన్నికల 2024కు సంబంధించి పిఠాపురం నియోజకవర్గానికి చెందిన స్ట్రాంగ్ రూమ్‌ను జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డి అధికారులతో గురువారం కలిసి పరిశీలించారు. జేఎన్‌టీయూలోని బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం నియోజకవర్గం ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను, నిఘా వ్యవస్థను అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో ఈనెల 13న పోలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ను నిరంతరం పరిశీలించేలా సీసీ కెమెరాలు అన్నివైపులా కనిపించేలా ఏర్పాటు చేయడంతోపాటు కేంద్ర, రాష్ట్ర బలగాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'లెక్క'లేస్తున్నారు!



- క్యాంపుల్లేవ్... క్యాంప్ ఆఫీసుల్లోనే..
- జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళిపై పార్టీల లెక్కల తక్కెడలు
- ఏ మండలంలో ఓట్లు ఎలా పడ్డాయో బూత్‌లవారీగా టీడీపీ, వైసీపీ ఆరా
- గతంలో పట్టుతగ్గిన ప్రాంతాల్లో ఇప్పుడెలా ఉందంటూ క్యాడర్ ద్వారా లెక్కలు
- ఎన్నికల తర్వాత విహారయాత్రల స్థానంలో వైసీపీ అభ్యర్థుల ఓట్ల పంచాయతీలు
- పలుచోట్ల అనుకున్నట్లు ఓట్లు పడలేదనే గుబులుతో క్యాడర్‌తో వరుస సమీక్షలు
- పలుచోట్ల పంచిన నగదు క్షేత్రస్థాయికి వెళ్లలేదని అభ్యర్థులకు ఫిర్యాదులు
- కడప బృందాల డబ్బు పంపిణీ పెత్తనంతో నష్టపోయామంటూ గుర్రు
- అటు టీడీపీ అభ్యర్థులు సైతం పార్టీ క్యాంప్ ఆఫీసుల్లో రోజువారీ సమీక్షలు
- ఓటింగ్ సరళి విశ్లేషించుకుంటూ మెజార్టీలపై క్యాడర్ ద్వారా లెక్కలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో జిల్లాలో టీడీపీ, జనసేన, వైసీపీ ఓట్ల లెక్కల్లో నిమగ్నమయ్యాయి. మండలాల వారీగా బూత్‌ల్లో ఓటింగ్ జరిగిన తీరుపై సమీక్షలు చేస్తున్నాయి. లెక్కల తక్కెడల్లో ఎక్కడెక్కడ మెజార్టీ వస్తుంది? ఎక్కడెక్కడ ఓటింగ్ పడలేదనే విశ్లేషణల కసరత్తులు కొనసాగిస్తున్నాయి. రోజూ క్యాంప్ ఆఫీసుల్లో కూర్చుని లెక్కల కూర్పులు చేస్తున్నాయి. వాస్తవానికి పోలింగ్ ముగియగానే అనేకమంది వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు విహారయాత్రలకు ప్రణాళికలు వేసుకున్నారు. తీరా ఓటింగ్ దిమ్మతిరిగేలా పడడంతో అవన్నీ రద్దు చేసుకుని బూత్‌లవారీగా లెక్కలు వేస్తున్నారు. ఆయా బూత్‌లో ఓటింగ్ శాతం ముందుంచుకుని లాభనష్టాలు బేరీజు వేస్తున్నారు. గత ఎన్నికల్లో తమకు బాగా ఓట్లు పడిన బూత్‌లు, దెబ్బతీసిన బూత్‌ల్లో పోలింగ్ నాడిని క్యాడర్ ద్వారా ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది క్యాడర్ అభ్యర్థులకు చేస్తున్న ఫిర్యాదులతో సదరు నేతలు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా డబ్బుల పంపకాల్లో కడప బృందాల పెత్తనంతో ఏవిధంగా నష్టపోయిందీ ముక్తకంఠంతో అభ్యర్థుల ఎదుట క్యాడర్ విస్తుపోయే నిజాలు విప్పుతుండడంతో అభ్యర్థులు నోరెళ్లబెడుతున్నారు. అటు టీడీపీ, జనసేన అభ్యర్థులు సైతం జనంలోనే ఉంటూ క్యాంప్ ఆఫీసుల్లో క్యాడర్ ద్వారా మెజార్టీల లెక్కలు విశ్లేషించుకునే పనిలో పడ్డారు.

లెక్క ఇలా తప్పిందేంటో..

పోలింగ్ ముగియగానే సుదీర్ఘ అలసట నుంచి ఉపశమనం కోసం జిల్లాలో పలువురు వైసీపీ అభ్యర్థులు విదేశీ విహార యాత్రలకు సిద్ధమయ్యారు. కానీ అంచనాలన్నీ పటాపంచలవడంతో ఎవరికివారు నియోజకవర్గాలకే కొన్నిరోజులుగా పరిమితమయ్యారు. భారీగా జరిగిన ఓటింగ్ తాము కున్న ఏకపక్ష విజయం అంచనాలను పటాపంచలు చేయడంతో ఎందుకిలా జరిగింది? ఎక్కువ పోలింగ్‌తో ఏయే బూత్‌ల్లో నష్టం వాటిల్లింది అనే లెక్కలపై మూడురోజులుగా అంచనాలు వేస్తున్నారు. వాస్తవానికి పోలింగ్ ముగియగానే తమ నేతలు రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లిపోతారని క్యాడర్ సైతం అంచనా వేశారు. తీరా రోజుకో మండలంపై సదరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు సమీక్షలు చేస్తూ నియోజకవర్గాల్లో బిజీగా గడుపుతున్నారు. వాస్తవానికి పోలింగ్ తర్వాత పూర్తిగా నియోజకవర్గాల్లో రాజకీయ సందడి మాయమై ఫలితాల సమయానికిగానీ కనిపించదు. కానీ విచిత్రంగా పోలింగ్ పూర్తయిన మరుసటిరోజు నుంచే వైసీపీ అభ్యర్థులు ఓట్ల లెక్కల్లో నిమగ్నమైపోయారు. ఓటమి భయం ఒకపక్క వెన్నాడుతుండడంతో ఎక్కడెక్కడ డ్యామేజీ జరిగిందనేదానిపై లెక్కలు ఆరా తీస్తున్నారు. కాకినాడ సిటీలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి వరుసగా డీకన్వెన్షన్‌లో క్యాడర్‌తో సమీక్షలు చేస్తున్నారు. వార్డుల్లో ఏ బూత్‌లో డ్యామేజీ జరిగింది? ఎన్ని ఓట్లు పోయి ఉంటాయి? బాగా వచ్చిన బూత్? అందుకు కారణాలపై లోతుగా విశ్లేషణలు జరుపు తున్నారు. కాకినాడ రూరల్, పెద్దాపురం అభ్యర్థులు కన్నబాబు, దొరబాబు సైతం క్యాంపు కార్యాలయాల్లోనే ఉంటూ సమీక్షలు చేస్తున్నారు. డ్యామేజీ ఏ మండలంలోని ఏ బూత్‌ల్లో జరిగిందో కారణాలు ఆరాతీస్తున్నారు. జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాలకు సంబంధించి ఆయా అభ్యర్థులు యాత్రలు రద్దు చేసుకుని క్యాంపు ఆఫీసుల్లో ఓట్ల లెక్కలు విశ్లేషించుకుంటున్నారు. బూత్‌లవారీగా పోలింగ్, తద్వారా తమకు ఏయే వర్గాలు ఎన్ని ఓట్లు వేసి ఉంటాయనే లెక్కల ద్వారా ఎన్ని ఓట్లు పోలై ఉంటాయనేది ఉజ్జాయింపు లెక్కలు వేస్తున్నారు. తద్వారా గెలుపోటములపై ఓ అంచనాకు వస్తున్నారు. ఈ లెక్కల్లో దాదాపు వైసీపీ అభ్యర్థులందరికీ దిమ్మతిరిగే ఫలితాలే కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని బూత్‌ల్లో ఓటింగ్ పడినా, మెజార్టీ బూత్ ల్లో బాగా ప్రభుత్వ వ్యతిరేకత, భూహక్కు చట్టం ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. మరోపక్క సమీక్షల్లో క్యాడర్ ప్రధానంగా కడప బృందాల పెత్తనంపై అభ్యర్థుల వద్ద ఏకరువు పెడుతుండడం విశేషం. ఎంపీ మిథున్‌రెడ్డి పంపిన బృందాల పేరుతో ఎన్నికల్లో నగదు పంపిణీ తమకు తెలియకుండా చేశారని, తద్వారా అసలు ఓటర్లకు చేరకపోవడం ఓటింగ్‌ను కొంత దెబ్బతీసిందంటూ ఆయా గ్రామాలవారీగా క్యాడర్ సదరు అభ్యర్థులకు పూసగుచ్చినట్లు వివరించడంతో జరిగిన నష్టాన్ని తల్చుకుని నేతలు తలపట్టుకుంటున్నారు. మరోపక్క ఎన్నికల సందర్భంగా పెట్టిన భారీ ఖర్చుల లెక్కలను సదరు అభ్యర్థులు సమీక్షల్లో క్యాడర్ వద్ద ప్రస్తావిస్తూ నిట్టూర్పుతున్నారు. పెట్టిన ఖర్చుకు ఫలితం కనిపించే అవకాశాలు లేకపోవడంతో తలపట్టుకుంటున్నారు.

లెక్కకు మించి...

టీడీపీ, జనసేన అభ్యర్థులు సైతం గడచిన మూడురోజులుగా క్యాంప్ కార్యాలయాల వేదికగా ఓట్ల లెక్కలు విశ్లేషించుకుంటున్నారు. కొందరు కుటుంబ సభ్యులతో కలిసి సేద తీరేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాలని ప్రణాళికలు సిద్ధం చేసుకోగా, ప్రత్యర్థి వైసీపీ నుంచి సమీక్షలు కొనసాగుతుండడంతో.. ఇక్కడా క్యాడర్‌ను ఉత్సాహపరిచేందుకు పోటీగా సమీక్షలు చేపడుతున్నారు. ఇందులోభాగంగా అంచనాలకు మించిన పోలింగ్ బాగా కలిసి వస్తున్నట్లు లెక్కలు తేల్చుతున్నారు. బూత్‌ల వారీగా లెక్కలు తీస్తూ మునుపటి ఎన్నికల్లో దెబ్బకొట్టిన గ్రామాల్లోను ఈసారి ఏకపక్షంగా పోలింగ్ జరిగినట్లు అంచనాకు వస్తున్నారు. వైసీపీకి అనుకూలంగా ఉన్న సామాజికవర్గాల నుంచి ఓట్లు బాగాపడ్డాయనే విషయాన్ని క్యాడర్ లెక్కలతో సహా అభ్యర్థులకు వివరిస్తున్నారు. పెద్దాపురం అభ్యర్థి చినరాజప్ప మూడురోజులుగా క్యాంప్ కార్యాలయంలో క్యాడర్‌కు అందుబాటులో ఉంటున్నారు. మున్సిపాల్టీలు, పంచాయతీలవారీగా బూత్‌ల వారీ పోలింగ్‌పై వీరితో సమీక్షించుకుని మెజార్టీపై ఓ అంచనాకు వచ్చినట్లు తెలిసింది. పిఠాపురంలో వార్ వన్‌సైడ్ అయిందని పోలింగ్ సరళి ద్వారా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ అంచనాకు వచ్చారు. తాజాగా పవన్‌కళ్యాణ్ సైతం లేఖలో పిఠాపురం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ అభ్యర్థులు కొండబాబు, పంతం నానాజీ సైతం క్యాడర్‌తో భేటీ అవుతూ పార్టీకి దాఖలయ్యే ఓట్లపై ఓ అంచనాకు వచ్చారు. జగ్గంపేట, ప్రత్తిపాడు, తునిలోను ఇప్పటికే వరుస సమీక్షలు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా ఆశించిన దానికంటే బూత్‌ల్లో ఓట్లు విరగబడ్డాయనే అంచనాతో విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షం



పిఠాపురంలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

- పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, జగ్గంపేటల్లో కురిసిన వాన
- చల్లబడ్డ వాతావరణం
- తడిచిన ధాన్యం రాశులు
- అపరాల పంటకు నష్టం

పిఠాపురం/గొల్లప్రోలు, మే 16: పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో గురువారం భారీవర్షం కురిసింది. తెల్లవారుజామునుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం, చినుకులు పడుతూనే ఉంటాయి. పలుచోట్ల రోడ్లపైకి నీరు ప్రవహించింది. డ్రైన్లు పొంగిపొర్లాయి. వర్షంతో వాతావరణం చల్లబడింది. కొద్దిరోజులుగా ఎండతీవ్రతతో తల్లడిల్లిన ప్రజలు సేదతీరారు. రెండు మండలాల పరిధిలోని గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. మరో రెండు రోజులు వర్షాలు కురవవచ్చునని వాతావరణ శాఖ సూచనలు ఇచ్చింది. గురువారం సాయంత్రం నుంచి ఉక్కపోత వాతావరణంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు.

కాగా అకాలవర్షంతో పొలాల్లో ఉండిపోయిన వరి కుప్పలు, ధాన్యం రాశులు నీటతడిచాయి. కళ్లాల్లోని ధాన్యం రాశుల్లో నిలిచిపోయిన నీటిని తొలగించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వర్షం తగ్గితే పర్వాలేదని, మళ్లీ వర్షం పడితే ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు దాళ్వా అనంతరం సాగు చేసిన వేసవి అపరాలకు నష్టం వాటిల్లింది. మినుము, పెసర మొక్కలకు కాసిన కాయలు వర్షం తాకిడికి పగిలిపోయాయి. వర్షం వలన గింజ గట్టిపడదని రైతులు తెలిపారు.

ప్రత్తిపాడులో భారీ వర్షం

ప్రత్తిపాడు, మే 16: మండలంలో గురువారం భారీవర్షం కురిసింది. ఉదయం నుంచి అడపాదడపా వర్షం పడుతూనే ఉంది. రెండునెలలుగా ఎండలతో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా ఆహ్లాదకరమైన వాతావరణంతో చల్లబడడంతో సేదతీరారు. ఈ వర్షంవల్ల మండలంలోని వేసవి వ్యవసాయ దుక్కులకు ఈ వర్షం ఎంతో మేలు చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

జగ్గంపేటలోను వాన

జగ్గంపేట, మే 16: మండలవ్యాప్తంగా గురువారం ఉదయం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం కురిసింది. అల్పపీడనం కారణంగా ఆకాశంలో మబ్బులు అలుముకుని ఓమోస్తారు వర్షం ఉదయం పడింది. మధ్యాహ్నం నుంచి వాతావరణం మామూలుగానే ఉంది. ఎండల ధాటికి అల్లాడిపోతున్న ప్రజలు వర్షం పడడంతో కాసింత సేదతీరారు.



పిఠాపురం మండలం రాపర్తిలో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పింఛను అందలేదు.. వేట పరిహారం రాదు



ఉప్పాడలో వలలు బాగు చేసుకుంటున్న మత్స్యకారులు

ఉప్పాడ(కొత్తపల్లి), మే 16: ప్రతినెలా ఇచ్చే పింఛన్లు రాలేదు, వేట పరిహారం ఇంకా చెల్లించలేదు. ఎలా తినాలి, ఎలా బతకాలని తీరప్రాంత మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రంలో మత్స్యసంపద పునరుత్పత్తి చెందుతుందనే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు వేట నిషేధాన్ని పటిష్ఠంగా అమలు చేస్తుంది. 61రోజులపాటు మత్స్యకారులు వేట విరమించినందుకు రూ.10వేల నష్టపరిహారాన్ని నిషేధకాలంలో మంజూరు చేస్తుంది. తీరప్రాంతాలకు చెందిన మత్స్యకారుల గ్రామాల్లో మత్స్యశాఖ అధికారులు మూడువారాల కిందట బోట్ల వారీగా కుటుంబాల వివరాలు నమోదు చేసుకుని ప్రభుత్వానికి వేటపరిహారం మంజూరుకు నివేదిక సమర్పించారు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో ప్రతినెలా ఇచ్చే పింఛన్లను బ్యాంకు ఖాతాలకు జమ చేయడంతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులో జమైన పింఛను సొమ్ములు ఇవ్వడానికి సవాలక్ష అవాంతరాలు పెట్టడంతో మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ఒకపక్క వేటనిషేధం, మరోపక్క పింఛను సొమ్ము రాకపోవడం, వేట నిషేధ పరిహారం మంజూరు కాకపోవడం వంటి సమస్యలతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో గ్రామాల్లో విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేశారని తామంతా అధికార పార్టీకి ఓటు వేయమనే అనుమానంతో తమ కుటుంబాలకు డబ్బులు ఇవ్వలేదని మత్స్యకారులు వాపోయారు. డబ్బులు ఇచ్చినా ఇవ్వకపోయినా తామంతా తమ కుటుంబాలను ఆదుకునే నాయకుడికే ఓట్లు వేశామని మత్స్యకారులు చెప్పడం విశేషం. గతేడాది వేట పరిహారం రెండు వారాల్లో మంజూరు చేశారని, ఈసారి ఓటు వేయమని పరిహారంతో పాటు వచ్చే పింఛను కూడా నిలిపివేయడం దుర్మార్గమని మత్స్యకారులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వేట నిషేధంలో సమీప తీరప్రాంతాల్లో మత్స్యకారులు వేటచేస్తూ జీవనోపాధి పొందుతున్నారని మత్స్యకారులు చెబుతున్నారు. ఉప్పాడ తీరప్రాంతానికి వచ్చేసరికి వేట చేయడానికి వీలు లేదని, వేటచేస్తే పింఛను, పరిహారాన్ని నిలిపివేస్తామని మత్స్యశాఖ అధికారులు భయపెడుతున్నారని మత్స్యకారులు వాపోతున్నారు. మత్స్యకార సామాజికవర్గానికి చెందిన నాయకులే అధికారులకు వంతపాడుతూ జీవనోపాధికి ఆటంకం కల్పిస్తూ మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి లేకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. వేట చేయకుండా, పింఛను అందకుండా, వేటపరిహారం మంజూరు కాకపోతే ఏం తిని బతకాలని తీరప్రాంత మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. వేట పరిహారం, పింఛను సొమ్ములను వెంటనే మంజూరు చేసి కుటుంబాలను ఆదుకోవాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు.

వేట నిషేధ పరిహారం తక్షణమే అందించాలి: సీపీఎం నగర కమిటీ డిమాండ్

కాకినాడ సిటీ, మే 16: మత్స్యకారులపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, వేట నిషేధ పరిహారం తక్షణమే అందించాలని సీపీఎం కాకినాడ నగర కమిటీ డిమాండ్ చేసింది. సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు స్థానిక ఏటిమొగ రోడ్‌లో మత్స్యకారులను గురువారం కలిసి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఒకపక్క ధరలు విపరీతంగా పెరిగిపోతూ కుటుంబ జీవనం కష్టంగా ఉందని మత్స్యకారులు వాపోయారు. వేటనిషేధం మొదలైన మొదటివారంలోనే అందించాల్సిన పరిహారం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. బోటులో పని చేసే మత్స్యకారులందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ ఏప్రిల్ 15న వేట నిషేధం మొదలై నెలరోజులు గడిచినా పరిహారం ఊసే లేదన్నారు. 61రోజుల జీవనానికి ఇచ్చే రూ.10వేలు కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. మత్స్యశాఖ అధికారులను సంప్రదిస్తే మత్స్య కారుల వివరాల సేకరణకు ప్రభుత్వంనుంచి ఆదేశాలు రాలేదని చెబుతున్నారన్నారు. అధికారులు స్పందించి తక్షణమే మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం పెరిగిన ధరల ప్రకారం రూ.20 వేల చొప్పున అందించాలన్నారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు.



కాకినాడలోని ఏటిమొగ రోడ్‌లో మత్స్యకారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- నన్ను ఆదరించి అండగా నిలిచిన మీ ప్రేమ మరువలేనిది
- నియోజకవర్గ ప్రజలకు పవన్‌కల్యాణ్ బహిరంగ లేఖ



- 7లో

ఏపీఈఏపీసెట్‌కు జిల్లాలో 1655మంది విద్యార్థుల హాజరు

- అగ్రికల్చర్,ఫార్మసీ పరీక్షకు మొదటి రోజు 90.14 శాతం హాజరు నమోదు
- పరీక్షల నిర్వహణా తీరును పరిశీలించిన సెట్ చైర్మన్, వీసీ ప్రసాదరాజు

- 7లో

నేటి నుంచి భావనారాయణస్వామి దివ్య కల్యాణోత్సవాలు

- 7లో



విషం తింటున్నాం..

ఫలం విషతుల్యం..రసాయనాలతో పండిపోతున్న మామిడి.. పండ్లు ప్రమాదకరం అంటున్న వైద్య నిపుణులు

మార్కెట్లో ప్రస్తుతం లభ్యమవుతున్న మామిడిపండ్లు కళకళలాడుతున్నాయి. నిండైన పసుపు పచ్చని రంగులతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. అయితే మేడిపండు సామెతలా ఈ పండ్లు పైపైనే చూడముచ్చటగా ఉంటున్నాయి..లోపల మాత్రం ప్రమాదకర రసాయనాలు దాగి ఉన్నాయి..అప్రమత్తంగా ఉండకపోతే రోగాలే..

తుని రూరల్, మే 16: మామిడి పండ్ల సీజన్ వచ్చిందంటే చాలు ఆ పండ్లను ప్రజలు ఎగబడి కొనుగోలు చేస్తారు. మామిడి పండ్లలో తీపితో పాటు రుచిని ఇచ్చే పండ్లు బంగిన పల్లి, కొత్తపల్లి కొబ్బరి, చెరుకురసాలు.. ఉద్యానవన పంటలో 60 శాతం ఈ జాతికి చెందిన మామిడి తోటలు సాగు అవుతున్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో మామిడి పండ్ల కొనుగోలు, దిగుబడి చేసేందుకు ఆసక్తి కనబరుస్తారు. ధర ఎంతైనా ఆలోచించకుండా కొనుగోలు చేస్తారు. కొనుగోలుదారుల నుంచి వచ్చే డిమాండ్లు చూసి మామిడి పండ్ల సీజన్‌కు నెల రోజుల ముందునుంచే వ్యాపారులు వాటిని అమ్మడం గమనార్హం. పండు దశకు వచ్చిన కాయను గడ్డిలో పెట్టి పండిస్తారు. అలా గడ్డిలో పెట్టిన కాయలు ఒకటి రెండు రోజుల్లో పండుతాయి. కొన్ని మూడు రోజులకు పండుతాయి. అలా రెండు మూడు రోజులు గడ్డి వేసి పండించని వ్యాపారులు రసాయనాలు వేసి ఒక్కరోజులోనే పండిస్తూ వాటిని ప్రజలకు అమ్మేస్తున్నారు. ఇలా రసాయనాలు వేసిన కాయలు మంచి పసుపు రంగు వచ్చి చూసేందుకు ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని చూసి కొనుగోలు చేసేందుకు ఎగబడతారు. ఎక్కువగా చైత్రమాసం మధ్య నుంచి మామిడి కాయలు మార్కెట్‌లో వస్తాయి. అవి కూడా గడ్డి వేసి పండించేవి ఉంటాయి.

మార్చి నుంచే మార్కెట్లోకి..

కొన్నేళ్లుగా మామిడిపండ్లు మార్చి నుంచే మార్కెట్‌లోకి వస్తున్నాయి. పూర్తిగా పక్వానికి రాని పండ్లపై రసాయనలు చల్లి పండిస్తూ జిల్లాల్లో వివిధ మార్కెట్లలో పెద్ద మొత్తంలో అమ్మకాలు జరుపుతున్నారు. మామిడికాయలపై రసాయనాలు చల్లి అమ్మకాలు సాగిసున్నా అవి తినే వారు రోగాలు పాలవడంతో గతంలో రాష్ట్ర ప్రభుత్వం వీటిని కట్టడి చేసేందుకు దుకాణాలపై దాడులు చేశారు. రసాయనాలు చల్లి అమ్మకాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గడంతో మామిడి పండ్లకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది. మెట్టలో వీటి అమ్మకాలు ఆశాజనకంగా మారి జిల్లాలో ప్రధాన మార్కెట్‌లలో రసాయనాలతో పండించిన పండ్లు పెద్ద మొత్తంలో అమ్మకాలు చేస్తున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో మామిడి పండ్ల ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా పండించిన పండ్లు కొనుగోలు చేసేందుకు సిద్ధపడిన దొరకని పరిస్థితి ఏర్పడిందని తెలుపుతున్నారు. రసాయనాలతో పండించిన పండ్లతో ప్రజారోగ్యానికి ముప్పు అని వివిధ రకాల క్యాన్సర్‌లకు రసాయనాలు కారణం అవుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



తుని-విశాఖపట్నం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన దుకాణం

పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా

తీర్చిదిద్దుతా

నన్ను ఆదరించి అండగా నిలిచిన మీ ప్రేమ మరువలేనిది

కుటుంబ సభ్యుడిగా నన్ను గుండెల్లో పెట్టుకున్నారు..

నియోజకవర్గ ప్రజలకు పవన్‌కల్యాణ్ బహిరంగ లేఖ



పిఠాపురం, మే 16: రానున్న రోజుల్లో అందరిని కలుపుకుంటూ పిఠాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కల్యాణ్ తెలిపారు. ఈ మేరకు ఆయన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు గురువారం బహిరంగలేఖ రాశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన తనను ఆదరించి అండగా నిలిచి మీరు చూపించిన ప్రేమ మరువలేనిదని, హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నాను అని ప్రకటించగానే స్వచ్ఛందంగా తరలివచ్చి కుటుంబ సభ్యుడిగా భావించి పనిచేయడం ఆనందం కలిగించిందని చెప్పారు. ఎన్నికల్లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్‌లో పాల్గొని రికార్డు స్థాయిలో 86.63 శాతం ఓటింగ్ నమోదు కావడం ప్రజల ప్రేమను తెలియజేస్తున్నదన్నారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జనసైనికులు, టీడీపీ, జనసేన కార్యకర్తలు వ్యవహరించిన తీరు అభినందనీయమన్నారు. సినిమాలు, ధారావాహికలకు విరామం ప్రకటించి పిఠాపురంలో ప్రతి గడపకు వెళ్లి ప్రచారం చేసిన సినీ, బుల్లి తెర నటీనటుల ప్రేమ తనను కదలించిందని పవన్‌కల్యాణ్ తెలిపారు. తన విజయాన్ని కాంక్షిస్తూ ఎంతో మంది అగ్ర కథానాయకులు నుంచి నవతరం నటుల వరకూ అందరు మద్దతు ప్రకటించడం ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. దేశ, విదేశాలు నుంచి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి తమ మాతృభూమి అభివృద్ధి ఆకాంక్షను వెల్లడించిన ఎన్నారై జన సైనికులకు అభినందనలు తెలియజేశారు.

బీఈడీ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు తదితరులు

దివాన్‌చెరువు, మే 16: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యాకళాశాల సహాయాచార్యులు ఎం.గోపాలకృష్ణ సహ రచయితగా రాసిన పుస్తకాన్ని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ప్రభుత్వ తెలుగు, సంస్కృత అకాడమీలో బీఈడీ మొదటి సంవత్సరానికి చెందిన భౌతిక, రసాయన శాస్త్ర బోధనాభ్యసన శాస్త్రం-1 అనే పుస్తకాన్ని ఆవిష్కరించామని వీసీ తెలిపారు. పుస్తక రచనకు సహకరించిన విశ్వవిద్యాలయ అధికారులకు, అధ్యాపకులకు గోపాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

యువకుడిపై దాడి ఘటనలో ఇద్దరికి జైలు శిక్ష

పెద్దాపురం, మే 16: స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో ఆరు సంవత్సరాల కిందట ఓ యువకుడిపై జరిగిన దాడి ఘటనలో ఇద్దరు నిందితులకు స్థానిక ఏజేఎఫ్‌ఎం జడ్జి బుల్లెమ్మ 10 నెలలు జైలు శిక్షతో పాటు రూ. ఆరు వేలు జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే 2018 సంవత్సరంలో స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన దార్ల సాయిపై జగ్గంపేటకు చెందిన వజ్రాంగి సుమన్, ఆనూరు గ్రామానికి చెందిన ఇంటి వీర వెంకట సాయికిరణ్ నగదు విషయంపై గొడవ పడి దాడిచేశారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ ఏ.కృష్ణభగవాన్ కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు పూర్తికావడం, నేరం రుజువు కావడంతో నిందితులు సుమన్, వీరవెంకట సాయికిరణ్‌కు 10 నెలలు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.ఆరు వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున డి.నాగరాజు వాదించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలమేరకు డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వెంకటరమణ సాక్ష్యులను సకాలంలో కోర్టులో హాజరుపరిచారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తపల్లి, మే 16: ఎద్దులు దెబ్బలాడుకొని వేగంగా ప్రయాణిస్తున్న బైక్‌పై పడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తమూలపేట సెజ్ పునరావాస కాలనీలో గురువారం సాయంత్రం జరిగింది. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని సమీపంలో అద్దరిపేటకు చెందిన ముత్తి దేముడు(19) తన స్నేహితునితో కలిసి గురువారం సాయంత్రం కాకినాడకు బీచ్‌రోడ్డులో బయలు దేరాడు. కొత్తపల్లి మండలం కొత్తమూలపేట వచ్చేసరికి రోడ్డుకు మధ్యలో పోట్లాడుతున్న ఎద్దులు వేగంగా ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టాయి. ఈ సంఘటనలో దేముడికి తీవ్ర గాయాలై కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రికి వెళ్లేలోగా దేముడు మృతి చెందాడని పోలీసులు తెలిపారు. దేముడు స్నేహితునికి తీవ్ర గాయాలవడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కొత్తపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుని కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- రేపటి నుంచి కల్యాణోత్సవాలు
- 19 రాత్రి దివ్యకల్యాణం
- రూ.50 లక్షలతో వేడుకలు
- కొండపై, కొండదిగువన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నూతన రథం
- మద్యం విక్రయాలపై ఆంక్షలు
- కల్యాణం వీక్షించేవారి సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు
- రత్నగిరి ఈవో రామచంద్రమోహన్



ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, మే 16: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడికి ఏడాదిలో అతి ముఖ్యమైన పర్వదినాలలో ప్రధానమైన సత్యదేవుడి వార్షిక కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ వెల్లడించారు. గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఏర్పాట్లు వివరాలు వెల్లడించారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 18 నుంచి ప్రారంభమై 24 వరకు జరుగుతాయని 19 రాత్రి 9గంటలకు దివ్య కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు రూ 50 లక్షలు బడ్జెట్ కేటాయించామని చెప్పారు. ప్రధానంగా 19 రాత్రికి జరిగే దివ్య కల్యాణం రోజున భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈఏడాది కొండపైన, కొండదిగువన కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కల్యాణం వీక్షించేభక్తులకు వార్షిక కల్యాణవేదిక ఎదురుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నామని, భారీ వాహనాలను కొండపైకి అనుమతించడం లేదని కొండదిగువ నుంచి కొండపైకి 8 ప్రత్యేకబస్సుల ద్వారా ఉచిత రవాణా సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. దూరం నుంచి వీక్షించే భక్తుల కోసం 5 చోట్ల ప్రత్యేక ఎల్‌ఈడీ స్ర్కీన్లు, కల్యాణం అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదం,, కల్యాణ అక్షింతల పంపిణీకి తూర్పు వైపు 5 కౌంటర్లు పశ్చిమ రాజగోపురం వైపు 3 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10 వేల ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతామన్నారు. రెవెన్యూ. పోలీస్, ఫైర్ ఇతర శాఖల సమన్వయంతో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కల్యాణం ప్రత్యక్షంగా వీక్షించలేని భక్తుల కోసం వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం అందజేయనున్నట్లు చెప్పారు. 22వ తేదీన రథోత్సవం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామని రూ.1.20 కోట్లతో తయారుచేసిన నూతన టేకు రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరుగుతుందన్నారు. కల్యాణోత్సవాల వారం రోజులు మద్యం విక్రయాలపై ఆంక్షలు విధిస్తూ సాయంత్రం 4 గంటలకే మెయిన్‌రోడ్డుపై మద్యం దుకాణాలను మూయించివేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది స్వామివారి శ్రీపుష్పయోగం స్వామివారి నూతన కల్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. వారం రోజులు నిత్యకల్యాణం నిలుపుదల చేసి హోమాలు, రథసేవను తాత్కాలికంగా నిలుపుదల చేస్తామని తెలిపారు.

రథం ట్రయిల్ రన్ విజయవంతం



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

సత్యదేవుడి సేవల కోసం రూ.1.20 కోట్లతో తయారుచేసిన పెద్ద టేకు రథానికి గురువారం నిర్వహించిన ట్రయిల్‌రన్ విజయవంతమైంది. స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాలలో 5వ రోజైన 22వ తేదీన సాయంత్రం ఈ రథంపై స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించనుండడంతో ట్రయిల్ రన్ నిర్వహించారు. కొండదిగువ పంపా సత్రం వద్దనుండి తొలిపావంచా వద్ద వరకు నిర్వహించగా అడ్డుగా ఉన్న విద్యుత్, ఇతర వైర్లను తొలగించి రథం పైభాగంలో మరో 6 అడుగుల ఎత్తు వరకు ప్రత్యేక విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి పైకి కట్టారు. కొన్ని లోటు పాట్లు కనిపించాయని వాటిని సవరించనున్నట్లు ఈవో రామచంద్ర మోహన్ తెలిపారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. వేకువజామున రెండు గంటలకు స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభ్యంగన స్నానమాచరింపచేశారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి భక్తులను సర్వదర్శనాలకు అనుమతించారు. గురువారం మూలవరులు నిజరూప దర్శనంలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆయుష్య హోమం నిర్వహించారు.

మొదటిరోజు ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్



పరీక్షల నిర్వహణా తీరును పరిశీలిస్తున్న వీసీ జీవీఆర్ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, మే16: ఏపీఈఏపీ సెట్-2024 ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఏపీ, హైదరాబాద్‌లోని 49 ప్రాంతీయ కేంద్రాల్లో మొదటిరోజు ప్రశాంతంగా జరిగినట్లు సెట్ ఛైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షల నిర్వహణాతీరును వర్సిటీలోని ఈఏపీసెట్ కార్యాలయంలో కన్వీనర్ కె.వెంకటరెడ్డి, కోకన్వీనర్లు, కోఆర్డినేటర్లతో కలిసి గురువారం పరిశీలించారు. కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి ఉదయం నిర్వహించిన పరీక్షకు 921మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 819మంది హాజరయ్యారని, 102మంది గైర్హాజరు కాగా 88.93 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ వెంకటరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 915మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 836మంది హాజరయ్యారని, 79మంది పరీక్ష రాయలేదని మొత్తం 91.37శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లకు కలిపి 1836మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1655మంది హాజరయ్యారని 181 మంది గైర్హాజరు కాగా మొత్తం 90.14 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. శుక్రవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించిన పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షలు ఈ నెల 23 వరకూ కొనసాగుతాయని తెలిపారు.



తాబేళ్లు స్వాధీనం

రంపచోడవరం, మే 16: తాబేళ్ల అక్రమ రవాణా కేసులో ఫోక్సుపేట రేంజ్ అటవీ శాఖాధికారులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రేంజ్ అధికారి కరుణాకర్ ఆధ్వర్యంలో ఫోక్సుపేట అటవీశాఖ తనిఖీ కేంద్రంలో బుధవారం అర్థరాత్రి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కోనసీమ జిల్లా రామచంద్రాపురం నుంచి మినీ వ్యాన్‌లో ఒడిసాకు గన్ని బ్యాగ్‌లలో తరలిస్తున్న 1589 తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. బతికి ఉన్న తాబేళ్లను అటవీ ప్రాంతంలో నీరు ఉన్న ప్రదేశాలలో వదిలిపెట్టనున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు.

నేటి నుంచి భావనారాయణస్వామి దివ్య కల్యాణోత్సవాలు

24 వరకు వివిధ కార్యక్రమాలు

సర్పవరం జంక్షన్, మే 16 : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోన్న సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి సప్తాహ్నిక దివ్య కల్యాణోత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు, ఆలయ ఛైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఈనెల 17న స్వామివారికి సుప్రభాత సేవ, అర్చనలు, హోమం, ప్రత్యేక పూజలను ఆలయ పండితులు నిర్వహిస్తారన్నారు. స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించిన అనంతరం సింహ వాహనంపై పల్లకీలో స్వామివారిని ఉంచి భక్తుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 19న స్వామివారి దివ్య కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహిస్తామన్నారు. 23న స్వామివారిని సూర్యారావుపేట బీచ్‌కు తీసుకెళ్లి చక్రస్నానం చేయిస్తామని తెలిపారు. 24న శ్రీపుష్ప యాగోత్సవంతో స్వామివారి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ప్రతీ రోజు స్వామివారిని పలు రకాల పుష్పాలతో అలంకరించి, సుప్రభాతసేవ, ప్రత్యేక పూజలు, పలు రకాల విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం వేళ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు కల్యాణంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

సీలేరు కాంప్లెక్స్‌లో హైడల్ డైరెక్టర్

సుడిగాలి పర్యటన



పనులు పరిశీలించిన అధికారులు

మోతుగూడెం, మే16: ఏపీ జెన్‌కో జల విద్యుత్ కేంద్రం(హైడల్) డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ గురువారం సీలేరు కాంప్లెక్స్‌లో సుడి గాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని రూ.530 కోట్ల వ్యయంతో జరుగుతున్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలోని రెండో దశ నిర్మాణ పనులను స్థానిక జెన్‌కో అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా 5,6 యూనిట్లకు నీటిని సరఫరా చేసే పెన్‌స్టాక్ పైప్‌లైన్ ఎరక్షన్ పనులను పరిశీలించారు. అనంతరం జల విద్యుత్ కేంద్రంలోని 5,6 యూనిట్లను అమర్చేందుకు డిజైన్ చేసిన సివిల్ పనులు కూడా పరిశీలించారు. అలాగే జల విద్యుత్ కేంద్రంలోని నాలుగు యూనిట్ల పని తీరుపై ఆరా తీశారు. యూనిట్లకు సాంకేతిక లోపాలు తలెత్తకుండా విద్యుత్ ఉత్పత్తిలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని, గ్రిడ్ అధికారులు ఆదేశాల మేరకు ఆదేశాలు జారీ చేసిన వెంటనే యూనిట్ వినియోగంలోకి వచ్చేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో అన్ని జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి వివరాలపై స్థానిక సీఐ బి.శ్రీనాథ్‌ను ఆరా తీశారు. అలాగే సీలేరు కాంప్లెక్సు నీటిని సరఫరా చేసే బలిమెల జలాశయంలో నీటి నిల్వలు ఎంత ఉన్నాయి, సీలేరు, డొంకరాయి జలాశయాల్లో ఎన్ని టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫోర్‌బై, డొంకరాయి పవర్ కెనాల్‌లను డొంకరాయి సీలేరు జల విద్యుత్ కేంద్రాలను హైడల్ డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్, సూపరింటెండెంట్ కేకేవీ ప్రశాంత్‌కుమార్, ఈఈ విజయ్‌కుమార్, మోతుగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏఈ పవన్‌విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వరదలను సమర్థవంతంగా ఎదుర్కొందాం

ధవళేశ్వరం, మే 16: రానున్న వరదల సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొందామని గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్ అన్నారు. గురువారం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లడ్‌బ్యాంక్స్ పటిష్టమైన నేపథ్యంలో బలహీనంగా ఉన్న గట్లను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల ఔట్‌ఫాల్ స్లూయిజ్ షెట్టర్‌లు రిపేర్లు చేసి పటిష్ఠ పరచాలన్నారు. వరదలను ఎదుర్కోవడానికి ఫడ్ స్టోర్స్‌లో ఫ్లడ్ మెటీరియల్ సిద్ధం చేయడానికి ఏర్పాట్లు చేయాలని ఎస్ఈకి సూచించారు. సమావేశంలో హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, తూర్పుడెల్టా ఈఈ వీవీ రామకృష్ణ, సెంట్రల్ డెల్టా ఈఈ శ్రీనివాస్, డ్రైనేజ్ డివిజన్ ఈఈ సుబ్బయ్య, వైఎస్‌సీ డివిజన్ ఈఈ విజయభాస్కర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.90.45 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం, మే 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి హుండీ కానుకలు లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పీవీవీఎస్ కామేశ్వరరావు, బి.కిరణ్ పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. 31 రోజులకు గాను ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.67,40,864, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.23,04,541 మొత్తం రూ.90,45,405 ఆదాయం లభించింది. బంగారం 14 గ్రాములు, వెండి 710 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ డీసీ, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. అలాగే క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీ ఆదాయం 2,30,472 ఆదాయం లభించింది. ఈ లెక్కింపులో బ్యాంకు సిబ్బంది, పోలీసులు, దేవస్థాన సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాకినాడ

పోలింగ్ ప్రారంభం కాకుండానే కేంద్రాల వద్దకు చేరుకుని యువతీ యువకులు, మహిళలు, వృద్ధులు బారులు తీరారు. రాత్రి పది గంటలకు ఓపికగా ఎదురుచూసి ఓటింగ్ వేశారు. ఎండతీవ్రత ఇబ్బందులకు గురిచేస్తున్నా లెక్క చేయకుండా ఓటుహక్కు వినియోగించుకున్నారు. ప్రస్తుతం వీరు ఎవరికి ఓటు వేశారనే అంశంపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. అది తమకు అనుకూలమని పోటీలో నిలిచిన అభ్యర్థుల మద్దతుదారులు అంచనాలు వేసుకుంటున్నారు.

ఏ తీరున ఓటేశారో!

- యువత, మహిళలు, వృద్ధుల ఓటింగ్‌పై అంచనాలు
- స్వస్థలాలకు వచ్చిన ఓటర్ల ఓటుపై చర్చోపచర్చలు
- అంతా మాకే అనుకూలమంటూ అంచనాలు



ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన మహిళలు

పిఠాపురం, మే 16: పిఠాపురం నియోజకవర్గంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసి మూడురోజులు గడుస్తున్నా లెక్కలుమాత్రం తెగడం లేదు. గతంలో ఎన్నడూలేని విధంగా పోలింగ్ కేంద్రాల వద్దకు ఉదయమే భారీగా ఓటర్లు చేరుకుని బారులు తీరడం, అందులో మహిళలు, యువతీ, యువకులు, వృద్ధులు అధికంగా ఉన్న నేపథ్యంలో ఇవి తమకే అనుకూలమంటూ ఆయా పార్టీల నేతలు పైకి చెబుతున్నా ఓటింగ్ ఏలా జరిగిందన్న దానిపై అంతర్గత చర్చలు సాగిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్దకు ఉదయమే అన్నివర్గాల ఓటర్లు బారులు తీరడం, ఈవీఎంలు, వీవీప్యాట్‌ల్లో ఇబ్బందులు తలెత్తినా గంటల తరబడి వేచి చూసి మరీ ఓటు వేయడం, ఇందులో మహిళలు, యువత, వృద్ధులు, ఇతర ప్రాంతాలు నుంచి స్వస్థలాలకు వచ్చిన ఓటర్లు అధికంగా ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

పురుషుల్లో 87.47శాతం ఓటేశారు

పిఠాపురం నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా 2,04,811మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. పురుషుల్లో 1,18,183మందికి 1,03,370 మంది, మహిళలలో 1,18,223మందికి 1,01,438మంది ఓటు హక్కు వినియోగించుకోగా ఇతరులు ముగ్గురు ఓటు వేశారు. పురుషుల్లో 87.47శాతం మంది ఓటు హక్కు వినియోగించుకోగా, మహిళల్లో 85.80శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులతో పోల్చుకుంటే మహిళల ఓటింగ్ శాతం స్వల్పంగా తక్కువగా ఉన్నప్పటికి 86శాతం మంది వినియోగించుకోవడం గమనార్హం. తొలిసారి ఓటుహక్కు పొందిన వారిలో 97శాతంపైగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు, వృత్తి, వ్యాపారాలు చేస్తున్న వారు సైతం 90శాతంపైగా తమ స్వస్థలాలుకు భారీగా తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు మండుటెండను లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

వీరంతా ఎటో

పోలింగ్ జరిగిన మే 13న ఉదయం 7గంటలు నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద యువత, మహిళలు, వృద్ధులు భారీగా బారులుతీరి ఓటుహక్కు వినియోగించుకున్న నేపథ్యంలో ఎవరికి వారే ఇది తమకు అనుకూలమని చెబుతున్నారు. ఇది వీరి ఓటింగ్ సరళి ఎలా ఉందనే విషయంపై మూడురోజులుగా జనసేన, టీడీపీ, బీజేపీ, వైసీపీ నేతలు చర్చలు సాగిస్తున్నారు. రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించాలని వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్వయంగా ఇక్కడ పోటీచేసిన నేపధ్యంలో యువతీ, యువకులు ఆయనకు అధికంగా మద్దతుగా నిలిచారు. ఆయన అభిమానులతో పాటు 18నుంచి 30 సంవత్సరాలలోపు ఉన్న యువతీ యువకులు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఓటువేసి వెళ్లిపోకుండా సాయంత్రం వరకూ వీరు పవన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించడాన్ని జనసేన వర్గాలు గుర్తు చేస్తున్నాయి. అదే విధంగా వైసీపీ పాలనలో అన్ని వస్తువుల ధరలు పెరిగిపోవడం, జీవనం భారంగా మారడం వంటి పరిణామాలు, కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18-60ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి ప్రతినెలా రూ.1500 ఇస్తామని చెప్పడం, ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి అమ్మఒడి ఇస్తామని ప్రకటించడం వంటి పరిణామాలు మహిళలు భారీగా ఓటింగ్ తరలిరావడానికి కారణమని, ఇదంతా కూటమికి అనుకూలంగా ఓటింగ్ జరిగిందని జనసేన, టీడీపీ నేతలు చెబుతున్నారు. పింఛన్ రూ.4వేలు చేస్తామని ప్రకటించడంతోపాటు జూన్ నుంచే పెంపు అమలుచేస్తామని, దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ ఇస్తామని చెప్పడం కూడా వృద్ధులు, దివ్యాంగులు భారీగా ఓటింగ్‌కు రావడానికి కారణమని, ఈవర్గాలన్నీ తమకు అనుకూలంగా ఓటు వేశాయని వారు అంచనా వేస్తున్నారు. వైసీపీ పాలనపై విసిగిపోయిన ప్రజలు కూటమి ప్రభుత్వం వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందనే భావనతో ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా స్వస్థలాలకు వచ్చి ఓటు వేశారని వారు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు, వాటి ద్వారా లబ్ధి పొందిన మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, వివిధ వర్గాల వారు వచ్చి ఓటు వేశారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇలా ఎవరికి వారు అంచనాలు వేస్తున్నా వారి అంతరంగం తెలియక చర్చోపచర్చలు సాగిస్తున్నారు. ఈవీఎంలు తెరిస్తేగానీ వీరు ఎటు ఓటు వేశారన్నది తేలదు. అప్పటివరకూ ఈ అంచనాలు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పిఠాపురం నియోజకవర్గంలోని ఓటర్లు

పట్టణం/మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పిఠాపురం	20,699	22,159	1	42,829
పిఠాపురం మండలం	31,469	30,625	0	62,093
గొల్లప్రోలు	10,297	10,320	0	20,617
గొల్లప్రోలు రూరల్	22,554	21,763	2	42,688
యు.కొత్తపల్లి	33,195	33,356	0	66,551
మొత్తం	1,18,183	1,18,223	3	2,36,409

ఓటు హక్కు వినియోగించుకున్న				ఓటర్లు	శాతం
పిఠాపురం	17,434	18,318	1	35,753	83.48
పిఠాపురం రూరల్	28,426	26,779	-	55,025	88.62
గొల్లప్రోలు	8,816	8,707	-	17,523	84.99
గొల్లప్రోలు రూరల్	19,590	18,783		2 38,375	86.59
కొత్తపల్లి	29,284	28,851	-	58,135	87.35
మొత్తం	1,03,370	1,01,438	3	2,04,811	86.63



కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్వో

కౌంటింగ్‌కు 14 టేబుల్స్: ఆర్వో

కార్పొరేషన్(కాకినాడ), మే 16: కాకినాడ సిటీ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి పార్లమెంటు, అసెంబ్లీలకు 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. గురువారం సాయంత్రం జేఎన్టీయూకే సివిల్ బ్లాక్‌లో ప్రతిపాదించిన కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆర్వో పర్యవేక్షించారు. చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పార్లమెంట్, అసెంబ్లీలకు ఏర్పాటు చేయాల్సిన టేబుల్స్, సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ నిర్వహణ సమయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చామన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర, ఏఈ రమేష్‌బాబు ఉన్నారు.

17న బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవి ఎన్నిక

కాకినాడ క్రైం, మే 16: కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి శుక్రవారం ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది టీపీఆర్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 కార్యవర్గానికి జరిగే ఉపాధ్యక్షుడు ఎన్నికకోసం 980 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటికే బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ, కోశాధికారి తదితర పదవులన్నీ ఏకగ్రీవం అయ్యాయన్నారు. ఉపాధ్యక్షుల పదవికి వీరభద్రరావు, సూదిన శ్రీనివాస్ బరిలో నిలవడంతో ఎన్నిక అనివార్యమైందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కాకినాడ క్రైం, మే 16: కాకినాడ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంఆర్‌వో ఆఫీసు ఎదురుగా ఉన్న చర్చి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు స్టేషన్ ఎస్‌హెచ్‌వో తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 944079 6542, 08842379052కుకు ఫోన్ చేయాలని కోరారు.

తునిలో పెరిగిన ఓటింగ్ శాతం

- అంతుపట్టని ఓటర్ల నాడి



లోవ కొత్తూరులో ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

తునిరూరల్, మే 16: తుని నియోజకవర్గంలో ఓటింగ్ శాతం గత ఎన్నడూ లేని విధంగా రికార్డుస్థాయిలో నమో దైంది. మండుటెండలో సైతం పెద్దఎత్తున ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం వేళం గాలివాన భీభత్సం సృష్టించినా తడుస్తూ మరీ ఓట్లు వేసేందుకు నిరీక్షించారు. అర్ధరాత్రి 12 అయినా వెనుదిరగకుండా ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 223 పోలింగ్ కేంద్రాల్లో 2,24,538 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1.87లక్షలకు పైగా ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2014లో 80.80శాతం నమోదు కాగా, 2019లో 82.25 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి రికార్డుస్థాయిలో 83.36 శాతం పోలింగ్ నమోదైంది. పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి అనుకూలంగా ఉండవచ్చని చర్చ జరుగుతుంది.

పెద్దాపురం నియోజకవర్గంలో మండలాల వారీగా పోలింగ్

సామర్లకోట, మే 16: పెద్దాపురం నియోజకవర్గంలో 82.29 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వెల్లడించగా మండలాల వారీగా పోలింగ్ సమాచారం గురువారం వెల్లడించారు. మొత్తం 201 పోలింగ్ బూత్‌లలో 2,15,095 మంది ఓటర్లుకుగాను 1,76,993 మంది ఓటుహక్కు వినియోగించుకోవడం ద్వారా 82.29శాతం పోలింగ్ నమోదైంది. పెద్దాపురం మండల పరిధిలో 58పోలింగ్ బూత్‌లకుగాను 60,051 మందికిగాను 52,710మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవడం ద్వారా 87.78శాతం పోలింగ్ నమోదైంది. పెద్దాపురం పట్టణ పరిధిలో 37 పోలింగ్ బూత్‌లకుగాను 41,277 మంది ఓటర్లుకు గాను31,482 మంది తమ ఓటుహక్కు వినియోగించుకోవడం ద్వారా 76.27 శాతం పోలింగ్ నమోదైంది. సామర్లకోట మండల పరిధిలో 69 పోలింగ్ బూత్‌లకుగాను 70,161 ఓట్లకుగాను 58,619మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా 83.55 శాతం పోలింగ్ నమోదైంది. సామర్లకోట పట్టణ పరిధిలో 37 పోలింగ్ బూత్‌లకుగాను 43,606 ఓట్లకుగాను 34,182 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా 78.39శాతం పోలింగ్ నమోదైంది. దీంతో సరాసరిన పెద్దాపురం నియోజకవర్గంలో 82.29 శాతం పోలింగ్ నమోదైంది.

అవినీతి సొమ్ము, మద్యంతో పవన్‌ను ఓడించే కుట్ర

- పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, మే 16: అవినీతి సొమ్ము, మద్యాన్ని ఎరగా వేసి జనసేన నేత అధినేత పవన్‌కల్యాణ్‌ను పిఠాపురంలో ఓడించే కుట్ర చేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. ఆయన గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ కుట్రలన్నింటిని ప్రజలు తిప్పికొట్టారని తెలిపారు. పిఠాపురంలో ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పవన్‌కు ఓటు వేశారని, వారందరికి తన కృతజ్ఞతలు తెలియజేశారు. గంజాయి, లిక్కర్, ఇసుక అక్రమ రవాణా, మట్టి, గ్రావెల్ మాఫియాతో సంపాదించిన అవినీతి సొమ్ముతో నియోజకవర్గాన్ని ముంచేశారని తెలిపారు. మద్యం ఏరులై పారించారని అందుకు నిదర్శనంగా పిఠాపురం పట్టణంలో రూ.2కోట్లు విలువైన గోవా మద్యం దొరకడమే కారణమని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎటువంటి అవినీతికి పాల్పడకుండా, మద్యం, డబ్బులు పంచకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలకులోబడి ఎన్నికలకు వెళ్లిందని, కేవలం రూ.45లక్షలు మాత్రమే ఖర్చు చేశామని వివరించారు. టీడీపీ నాయకులు సకుమళ్ల గంగాధర్, అనిశెట్టి సత్యానందరెడ్డి, గిరీష్ వర్మ, అడ్డగర్ల శివ పాల్గొన్నారు.

కొండబాబును కలిసిన టీడీపీ శ్రేణులు



కొండబాబును కలిసిన టీడీపీ శ్రేణులు

కాకినాడ సిటీ, మే 16: కాకినాడ నగరంలోని పలు డివిజన్ల నుంచి టీడీపీ శ్రేణులు గురువారం కాకినాడ సిటీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబును ఆయన నివాసంలో కలిశారు. తమ ప్రాంతాల్లో జరిగిన పోలింగ్‌శాతం, ఇతరత్రా విషయాలను వివరించారు. పోలింగ్ కేంద్రాలవద్ద వైసీపీ ఆగడాలకు ఆస్కారం లేకుండా ధీటుగా ఎదుర్కొన్నట్లు తెలిపారు. పోలింగ్ పూర్తయ్యేవరకు కేంద్రాలవద్దే కనిపెట్టుకుని ఉన్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు వల్ల ఓటర్లు సజావుగా ఓటుహక్కు వినియోగించుకోగలిగారని తెలిపారు. ఈ సందర్భంగా కొండబాబు వారిని అభినందించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

ప్రత్తిపాడు, మే16: రాష్ట్రలో జనసేన, టీడీపీ, బీజేపీకూటమి ప్రభుత్వంఏర్పాటు కావడం ఖాయమని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమయ్యబాబు చెప్పారు. ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజాను గురువారం సాయంత్రం తమ్మయ్యబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ జనసేన కార్యకర్తలు, నాయకులు ప్రత్తిపాడు తరలివచ్చి అభినందించారు. ఈ సందర్భంగా తమ్మయ్యబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి సత్యప్రభ భారీ మెజార్టీతో విజయం సాధించనుందని తెలిపారు. కూటమి మిత్రపక్షాలు నియోజకవర్గఎన్నికల్లో కలిసికట్టుగా గెలిపే లక్ష్యంగా పనిచేయడం సంతోషమని సత్యప్రభ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దాసంశేషారావు, ఏలేశ్వరం మండల పార్టీ అధ్యక్షులు పెంటకోట మోహన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు కందా వీరాస్వామి, గున్నాబత్తుల రాజబాబు, ఊట వీరబాబు, చింతాకుల రామకృష్ణ, రెడ్డి లోవరాజు, గంటు వెంకటరమణ, వీర్ల బేబి, రెడ్డి వరలక్ష్మి, తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు సత్యప్రభను కలిసి అభినందించారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో పుస్తక పఠనం



కాకినాడ సిటీ, మే 16: కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యార్థులకు పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఉపాధ్యాయురాలు ఎం.సత్యబాల విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్ బోధించారు. ఉదయం 10.10 గంటల నుంచి 11.30 గంటల వరకు ఉపాధ్యాయురాలు పీఎస్ సుధారాణి విద్యార్థులకు కథలు చెప్పడం, విద్యార్థులతో కథలు చెప్పించడం చేశారు.

మరిడమ్మకి పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం, మే 16: స్థానిక మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని గురువారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాభిషేకంలో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు వేదపండితులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానం

తాళ్లరేవు, మే 16: తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీషు, తెలుగు మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 15వ తేదీనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆశక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

'బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

కాకినాడ సిటీ, మే 16: ప్రజాస్వామ్యంలో ఎవరికి నచ్చినట్లు వారు ఓటు వేసుకోవచ్చని, నాయీబ్రాహ్మణ కుల సంఘ సభ్యులపై ఎటువంటి దాడులు జరిగినా, ఇబ్బందులకు గురి చేసినా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ధన్వంతరి నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ హెచ్చరించారు. తుని నియోజకవర్గం తిమ్మాపురంలో పోలింగ్ రోజున నాయీబ్రాహ్మణ కులానికి చెందిన జనసేన కార్యకర్త దోమడ నాగబాబుపై వైసీపీకి చెందిన కొందరు భౌతిక దాడి చేసి భయభ్రాంతులకు గురిచేశారనే సమాచారం తెలుసుకున్న గోపాలకృష్ణ ఫోన్ ద్వారా పరామర్శించారు. రెండురోజులుగా వైసీపీకి చెందిన కొందరు తన ఇంటికి వస్తూ బెదిరిస్తున్నారని, ఫోన్ చేసి దుర్భాష లాడుతున్నారని బాధితుడు తెలపడంతో బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ అధికారులను కోరారు.

విధి నిర్వహణలో హోంగార్డుల సేవలు అభినందనీయం



పదవీ విరమణ చేసిన హోంగార్డులను సత్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం, మే 16: అంకితాభావంతో విధులు నిర్వహిస్తూ పోలీసుశాఖతో మమేకమై హోంగార్డులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. హోంగార్డ్స్ యూనిట్‌లో హోంగార్డులుగా పనిచేస్తూ పదవీవిరమణ చేసిన సదాశివుని సత్యనారాయణ, జంగా బాలకృష్ణలను జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. వీరికి రావాల్సిన రాయితీలు సత్వరంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ, సత్యనారాయణలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఏవో ఎం.శివరామరాజు, హోంగార్డ్సు ఆర్ఐ వెంకటరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో డెంగీ వ్యాధి నిర్మూలన



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ నరసింహనాయక్

జీజీహెచ్ (కాకినాడ), మే 16: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీరు లేకుండా చేయడం ద్వారా డెంగీ వ్యాధిని నివారించవచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. కాకినాడ రామారావుపేట యూపీహెచ్‌సీలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగీ నివారణ కోసం సమాజంతో కలవండి, డెంగీ వ్యాధిని నివారించండి అనే నినాదంతో గురువారం పోస్టర్‌ని ఆవిష్కరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా దోమల ఆవాసాలను గుర్తించి, తగిన నివారణా పద్ధతులు చేపట్టాలన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, మలేరియా అధికారి ఎస్.భాస్కరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీ పాల్గొన్నారు.

గొల్లప్రోలు: డెంగ్యూ జ్వరాలు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా గొల్లప్రోలు అర్బన్ హెల్త్ సెంటర్, రూరల్ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వేర్వేరుగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కె.సుబ్బారావు, సునీత మెర్సీ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై ర్యాలీ

గండేపల్లి: జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కేవీ నరేష్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. రాబోయే వర్షాకాలంలో దోమలు పెరిగి తద్వారా వచ్చే వ్యాధులు అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శర్మ, పీహెచ్ఎన్ రూతమ్మ, సూపర్‌వైజర్లు ఎ.చల్లారావు, హెచ్‌వి ఈశ్వరమ్మ, ఎల్‌టి నాగార్జున, ఫార్మాసిస్టు హిమవతి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని రాచపల్లి గ్రామంలో గురువారం డెంగ్యూ నివారణ ర్యాలీ నిర్వహించారు. రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈ ర్యాలీని డాక్టర్ గీత ప్రారంభించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆనంద్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల ప్రతిభ



పదిలో ప్రతిభచూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, మే 16 : ఇటీవల విడుదల చేసిన పదో తరగతి సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో కాకినాడ రూరల్ వలసపాకల కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.శేఖర్ తెలిపారు. కేంద్రీయ విద్యాలయం నుంచి పది పరీక్షలకు 35 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకాగా అంతా ఉత్తీర్ణత సాధించారన్నారు. పి. వర్షిత 500 మార్కులకుగానూ 487 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందని, కె.రుఫీనాసాగర్ 475 మార్కులతో ద్వితీయ స్థానం, జి.నాగరత్నసవ్య 453 మార్కులతో తృతీయస్థానం సాధించినట్లు తెలిపారు. వీరిలో కె. రుఫీనాసాగర్ సంస్కృతం, సోషల్ స్టడీస్‌లో 100కి 100 మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. అలాగే సంస్కృతంలో పి.వర్షిత వందకు 100 మార్కులు సాధించినట్లు తెలిపారు. పదిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు.

పారా లీగల్ వలంటీర్లుకు దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం, మే 16: జాతీయ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వులు ప్రకారం పారా లీగల్ వలంటీర్ల పథకం కింద ఏడాది పాటు పనిచేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి తెలిపారు. మెట్రిక్యులేషన్ దాని సమాన విద్యార్హత కలిగి ఉండి, 18 సంవత్సరాలు నిండిన గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాలుకు చెందిన వారు పారా వలంటీరుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 20వ తేదీలోగా మండల న్యాయ సేవాధికార కమిటీకి సమర్పించాలని సూచించారు.

నేడు రాజమహేంద్రవరంలో బాస్కెట్‌బాల్ ఎంపికలు

పిఠాపురం, మే 16: విజయవాడలో ఈనెలలో జరిగే యూత్ బాయ్స్ అండ్ గరల్స్ బాస్కెట్‌బాల్ స్టేట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక ఈ నెల 17వ తేది ఉదయం 8గంటలకు రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాల ఆవరణలో ప్రారంభమవుతుందని ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు(అయలు) తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే వారు 2008 జనవరి 1వ తేది తర్వాత పుట్టిన వారై ఉండాలని చెప్పారు. పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఓరిజనల్ ఆధార్, పుట్టిన తేదీ ధ్రువపత్రాలు తీసుకురావాలన్నారు.

రేపటి నుంచి బాక్సింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్

పిఠాపురం, మే 16: పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఈనెల 18నుంచి 31వ తేదీ వరకూ బాక్సింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. కాకినాడ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ప్రతిరోజు ఉదయం 6నుంచి 7.30 వరకూ జరుగుతుందని చెప్పారు. వివరాల కోసం సెల్ 9989001162లో సంప్రదించాలని సూచించారు.

బంగారయ్యపేటలో అన్నదానం

రౌతులపూడి, మే 16: బంగారయ్యపేట గ్రామంలో కోటా లమ్మతల్లి ఆలయంవద్ద అన్నదానం నిర్వహించారు. కోటాలమ్మ తల్లి పండగను పురష్కరించుకుని కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించగా అధిక సంఖ్యలో గ్రామస్థులు హాజరై అన్నదానం స్వీకరించారు.

విద్యార్థులకు నైపుణ్యాలపై అవగాహన

ఏలేశ్వరం, మే 16: గ్రంథాలయంలో విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. గురువారం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఉపాధ్యాయులు మజ్జి నాగేశ్వరారావు, మామిడి రాంబాబు విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు, గణితశాస్త్రం, సృజనాత్మకత, నైపుణ్యాలపై తరగతులు నిర్వహించారు.

రేపు వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి

జగ్గంపేట, మే16: జగ్గంపేట మండల ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్, వాసవీ బీటెక్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి 1021వ జయంతిని ఈనెల 18న ఘనంగా నిర్వహించనున్నట్లు జగ్గంపేట ఆర్యవైశ్య సేవాసంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు తెలిపారు. శనివారం ఉదయం పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, కుంకుమపూజ, వెండి చీరాలంకరణ జరుగుతుందన్నారు. ఆర్యవైశ్య వనికుల బాలికల కలశాలతో అమ్మవారిని హంస వాహనంపై ఊరేగించి కల్యాణ మండపంలో పుష్పార్చన, అష్టోత్తర కుంకుమార్చన నిర్వహిస్తారన్నారు. పద్మ ఇండస్ట్రీస్ కంచర్ల శ్రీనివాసరావుచే అన్నసమారాధన ఏర్పాటు చేస్తారన్నారు.

నారా లోకేష్ యువజన ఫౌండేషన్ అధ్యక్షుడిగా మాదేపల్లి

గొల్లప్రోలు, మే 16: నారా లోకేష్ ఫౌండేషన్ పిఠాపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా గొల్లప్రోలు పట్టణానికి చెందిన మాదేపల్లి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నాగేశ్వరరావు తెలిపారు. నాగేశ్వరరావును టీడీపీ గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదేపల్లి వినీల్‌వర్మ తదితరులు అభినందించారు.

డ్రైనేజీలు నిర్మించండి



రౌతులపూడి, మే 16: బలరామపురంలో ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. మురిగునీరు, వర్షంనీరు పోయేమార్గం లేకపోవడంతో రహదారిపైనే నీరు నిల్వ ఉంటుంది. దీంతో ప్రయాణికులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోందని దోమలు వృద్ధి చెంది రోగాలభారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు ఖర్చు చేసి సిమ్మెంట్ రహదారి నిర్మించారు తప్పా మురుగు, వర్షం నీరు పోయేందుకు డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడు తున్నామని అధికారులు స్పందించి మురుగునీరు పోయే మార్గం చూపించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రకటన

మా క్లయింటు ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ, పొన్నగంటి వారి సందు, డో.నెం.29-9-52E నివాసం గల శ్రీ కనకాల వీర్రాజు గారి భార్య శ్రీమతి దుర్గలక్ష్మి గారి సంజాయిషీ ప్రకారం ఈ దిగువ ప్రకటన జారీ చేయడమైనది.

మా క్లయింటు తన స్థిరాస్తి 95.33 చ.గ.ల స్థలము అందలి పెంకుటిల్లు, డో.నెం.31-7-11/1, రాజాజీ వీధికి దక్షిణం: సూర్యనారాయణమూర్తిపురం ఏరియా, కాకినాడ తాలూకు ఒరిజినల్ క్రియ దస్తావేజు ది.29-04-2004, దస్తావేజు నెం. 4003/2004 జిరాక్స్ తీయించకొను నిమిత్తం వారి నివాసం నుండి వెళ్తుండగా, సదరు ఒరిజినల్ దస్తావేజుయున్న సంచి దారిలో పడిపోయినది. కావున సదరు దస్తావేజు ఎవ్వరికైనా దొరికినచో ఈ దిగువ చిరునామా దారునికి అందజేయగలరు.. సదరు దస్తావేజు ఆధారంగా ఎవ్వరేని ఎటువంటి దస్తావేజులు సృష్టించినగాని, అన్యాక్రాంతములు చేసినగాని యట్టి యావత్తు చర్యలు చెల్లనేరవు మరియు మా క్లయింటు పై బైండు చేయనేరవు.

కాకినాడ 16.05.2024 — ఎస్.వి.హయగ్రీవరావు, గాదం శ్రీఅనుహిత, అడ్వకేట్స్, 21-1-7, సాలిపేట, కాకినాడ, 98495 99091

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

A.S No. 34/2023

కరణం రమేష్‌బాబు ...అప్పీలెంట్

వర్సెస్

షేక్ రజియా బేగం వగైరాలు ...రెస్పాండెంట్స్

To:

R3: తోటపాటి సూర్యనారాయణమ్మ, W/o. సత్యనారాయణ చౌదరి, R/o. ఏడిద గ్రామము, మండపేట మండలం, తూర్పు గోదావరి జిల్లా.

R4: కొనకరెంపాటి భాగ్యలక్ష్మీ @ భారతిదేవి D/o. సత్యనారాయణచౌదరి, R/o. ఏడిద గ్రామము, మండపేట మండలం, తూర్పు గోదావరి జిల్లా.

R5: కె.దేవమ్మ, D/o. కోటపాటి సత్యనారాయణ చౌదరి, C/o. వెన్నెల ఇయంట్ జనరల్ హాస్పిటల్, Opp. క్రిస్టీ కమ్యూనిటీహాల్, 100 బిల్డింగ్స్ సెంటర్, కాకినాడ టౌన్ మరియు మండలం తూర్పు గోధావరి జిల్లా.

మీకు పై కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన మీకు నోటీసు జారీ నిమిత్తము శ్రీ కోర్టు వారు తే.25-06-2024 న ఉదయం గం॥10-30 నిముషములకు, పై కోర్టులో స్వయంగా గాని, లేక ఏజెంటు ద్వారా హాజరై ఎట్టి అక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలసినది. లేని ఎడల మీ పరోక్షము తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 25-06-2024

ఇట్లు

శ్రీ జి.టి. శివశర్మ, అప్పీలెంట్‌తరుపు అడ్వకేట్, దరిశి, ప్రకాశం జిల్లా.

స్థలం: దరిశి
తేది: 17-05-2024